క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని రామ్మూర్తినగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మన ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయసాయిరెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో మన ఎమ్మార్పీస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లాల శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు సునీత, నవ్యాంధ్ర ఎమ్మార్పీస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం, నాయకులు సుబ్రహ్మణ్యం, రవి, పృధ్వీతేజ, రమణరాజు, దామోదర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోను కలిసిన ఎన్నికల వ్యయ పరిశీలకుడు



నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలో నెల్లూరు సిటీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ వికాస్‌మర్మత్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకుడు కంచన్‌రామ్‌మీనా గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం ఇరువురు వివిధ అంశాలపై పరస్పరం చర్చించారు. అనంతరం ఆర్వో పలువురు అధికారులతో కలిసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు.

కలెక్టర్‌గా ఆదరించారు.. ఎంపీగా ఆశీర్వదించండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గతంలో నెల్లూరు జిల్లా పనిచేసిన సమయంలో ప్రజాకలెక్టర్‌గా తనను ప్రజలు ఆదరించారని, ప్రస్తుతం ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని కొప్పుల రాజు కోరారు. గురువారం ఆయన నగరంలోని డీఆర్ ఉత్తమ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం తాను వీఆర్సీసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మద్దతు తెలిపాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ తదితరులు, పాల్గొన్నారు.

ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించండి



నెల్లూరు(అర్బన్): ఏపీజీఎల్ఐకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు కోరారు. ఈ మేరకు ఏపీజీఎల్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌కుమార్‌కు నగరంలోని ఆయన కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సాఫ్ట్‌వేర్‌లోని లోపాల కారణంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఖాతాల్లో కొన్ని నెలలుగా మిస్సింగ్ క్రెడిట్స్ కనిపిస్తున్నాయన్నారు. రుణాలు తీసుకోకపోయినప్పటికీ పొందినట్లుగా కనిపిస్తున్నాయన్నారు. నామినీలు సైతం తప్పుగా కనిపిస్తున్నాయన్నారు. ఈ సమస్యలను తక్షణమే సరిచేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకుడి చేరిక



దర్గామిట్ట: నగరంలోని 19 డివిజన్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నెల్లూరు శ్రీనివాసులునాయుడు తన అనుచరగణంతో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరంలోని రామ్మూర్తినగర్‌లోని తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడు పీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

మెరుగైన అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తాం



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టౌన్‌హౌస్‌పేట): త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదిస్తే రానున్న ఐదేళ్ల కాలంలో మెరుగైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 16వ డివిజన్ చిల్డ్రన్స్‌పార్కు ప్రాంతంలో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌తో కలిసి గురువారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. తన సొంత గడ్డ నెల్లూరులో పోటీ చేసే అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసిన ఘనత మన జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో ఒక సామాజిక బాధ్యతగా ఆయన ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేశారని వివరించారు. విద్యను వ్యాపారంగా మార్చిన వ్యక్తి నారాయణ అని, ఆయన టీడీపీ నుంచి పోటీ చేస్తున్నారని, ఆయనను ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. పొంగూరు నారాయణ ప్రచారంలో పొంగే ఉందన్న విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. 16వ డివిజన్ ప్రాంత ప్రజలకు డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.29.24 కోట్ల మేర లబ్ధి చేకూర్చామని వివరించారు. రూ.15 కోట్లతో చిల్డ్రన్స్‌పార్కు రోడ్డుతో పాటు ఇతర రోడ్ల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కు, జగదీష్ పార్కుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ముత్తుకూరు గేటు వద్ద ఉన్న ఫ్లయిఓవర్ బ్రిడ్జి నుంచి చిల్డ్రన్స్‌పార్కు వైపు రోడ్డు విస్తరణ చేపడుతామన్నారు. జాతీయ రహదారిని కలిపే రోడ్డు విస్తరణ ద్వారా రాకపోకల సమస్యలు పరిష్కరించవచ్చని అభిప్రాయపడ్డారు. ఆర్యవైశ్యులకు అండగా మన ప్రభుత్వం నిలిచిందని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వ్యాపారులపై ప్రభుత్వ శాఖల దాడులు జరగలేదన్నారు. నెల్లూరును క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా చేసేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటుకు కృషి చేస్తానని, తద్వారా నగరంలోని చెట్లను నరికి వేయకుండా పచ్చదనాన్ని పెంపొందిస్తామన్నారు. 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీకాంత్ బాగా పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ నగరంలో ఏ ప్రాంతానికి ప్రచారానికి వెళ్లినా జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు సంతోషంగా చెబుతున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకుంటే మరిన్ని పథకాలు అమలవుతాయన్నారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నెల్లూరు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వైఎస్సా ర్‌సీపీ నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్ శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు, తది తరులు పాల్గొన్నారు.



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న విజయసాయిరెడ్డి, ఖలీల్

వైఎస్సార్‌సీపీలో చేరికలు శుభపరిణామం



పార్టీలో చేరిన ఆమ్‌ఆద్మీ పార్టీ వారితో ఆదాల



పార్టీలో చేరిన రమణయ్య అనుచరులతో ఆదాల

- వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో పెద్దఎత్తున చేరుతుండడం శుభపరిణామమని ఆ పార్టీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దారా వెంకటరమణయ్య గురువారం ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో ఆదాల పార్టీలో చేరిన రమణయ్యతో పాటు 70 కుటుంబాలకు చెందిన అనుచరగణానికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జిల్లా ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి షేక్ సైదు, బీడీ కార్మికుల మహిళా విభాగం నాయకురాలు షేక్ షబ్నా, పొదుపు లక్ష్మి మహిళా విభాగం నాయకురాలు షేక్ నూర్జహాన్, భవన కార్మికుల నాయకుడు షేక్ జాఫర్ తదితరులు ఉన్నారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ మొబీనా, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా అధ్యక్షురాలు జయమ్మ ఆ పార్టీకి చెందిన 200 మందితో కలిసి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో ఆదాల పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ నాయకులు దాసరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.
- నెల్లూరు రూరల్ మండలం పాతవెల్లంటికి చెందిన టీడీపీ నాయకుడు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ వనం రవి ఆ పార్టీని వీడారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పాతవెల్లంటిలో పర్యటించిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వనం రవితో పాటు పాదర్తి శ్రీనివాసులు, పాదర్తి సుధాకర్, జువ్వకల వెంకటరమణయ్య, పాదర్తి నారాయణ, వనం సుధాకర్ తదితరులు ఉన్నారు.
- సీనియర్ రాజకీయ నాయకుడు గునపాటి వెంకటసుబ్బారెడ్డి వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వెంకటసుబ్బారెడ్డికి మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో ఆదాల పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గునపాటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపుపకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆగాల శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులను బైండోవర్ చేయాలి

- ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్



సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్‌ను బైండోవర్ చేయడంతో పాటు వారి కదలికలపై నిఘా ఉంచాలని ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన దర్గామిట్ట పోలీసుస్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్ పరిధులు, భౌగోళిక స్థితిగతులు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, అసాంఘిక శక్తుల బైండోవర్లు, తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు. ప్రచార కార్యక్రమాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. ఏ ఇద్దరు అభ్యర్థులు ఒకే రోజు ఒకే సమయంలో కాకుండా వేర్వేరు దినాల్లో ర్యాలీలు నిర్వహించుకునేలా చూడాలన్నారు. అందుకు అభ్యర్థులు సహకరించాలని కోరారు. ప్రచారాల్లో డీజేలు, మందుగుండు సామగ్రి నిషిద్ధమన్నారు. ఆయన వెంట నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారెడ్డి, అల్తాఫ్‌హుస్సేన్ ఉన్నారు.

రాజకీయాల్లో అవినీతి మచ్చలేని వ్యక్తి ఆదాల



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆదాల హిమబిందు

నెల్లూరు సిటీ: 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎటువంటి అవినీతి మచ్చ లేని నిస్వార్థ ప్రజాసేవకుడు తన తండ్రి, వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి అని ఆదాల హిమబిందు పేర్కొన్నారు. గురువారం ఆమె తన తండ్రికి మద్దతుగా 25వ డివిజన్‌లోని బుజబుజనెల్లూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన తరువాత కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. తన తండ్రిని ఆశీర్వదిస్తే రూరల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బద్దెపూడి రవీంద్ర, కాకుటూరు లక్ష్మీసునంద, పాశం శ్రీనివాస్, వేలూరు శ్రీధర్‌రెడ్డి, 25వ డివిజన్ ఇన్‌చార్జి షేక్ నవాబ్‌జాన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు షేక్ ఖాదర్ బాషా, నాయకులు సయ్యద్‌షఫీ హుస్సేన్, రవీంద్ర, అమీర్‌జాన్, పాడమేకల శ్రీహరి యాదవ్, హంషీద్ అలీ, మూల మల్లికార్జున్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జెనెక్స్‌లో జాబ్‌మేళా



నెల్లూరు(అర్బన్): హరనాథపురంలోని జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాలలో జెనెక్స్ విజన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. రిలయన్స్ కంపెనీ ప్రతినిధులు తమ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు విద్యార్థులకు రాతపరీక్ష, గ్రూపు చర్చలు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెనెక్స్ కళాశాల చైర్మన్ వెంగళ్‌రెడ్డి మాట్లాడుతూ 80 మందికి పైగా విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరవగా, 22 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. రిలయన్స్ హెచ్‌ఆర్ భానుప్రకాష్, మేనేజర్ క్రాంతికుమార్, ప్రిన్సిపల్ తేజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్స్ ఏర్పాటు చేస్తున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి గురువారం ఒకప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వాకర్స్‌రోడ్డు, ములుమూడి బస్టాండ్, ఎస్ఎంసీ, కోటమిట్ట, మన్సూర్‌నగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పరమేశ్వరీనగర్, మనుమసిద్ధినగర్, పొర్లుకట్ట, బొమ్మ కేశవులు వీధి, ములుమూడి బస్టాండ్, కోటమిట్ట, మన్సూర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



41వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మేయర్ స్రవంతిజయవర్ధన్



12వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న జయవర్ధన్



21వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మొయిళ్ల గౌరి

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని నగర మేయర్ పీ స్రవంతిజయవర్ధన్ కోరారు. 41వ డివిజన్‌లోని దామాయదిబ్బ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ కువ్వాకుల విజయలక్ష్మితో కలిసి గురువారం ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా గడపగడపకు సంక్షేమ ఫలాలను చేరవేసి పేదలకు ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. డివిజన్ ఇన్‌చార్జి కువ్వాకుల బాబ్జీ, పార్టీ నాయకులు కృష్ణ, ప్రసాద్, గోపి, ఏడుకొండలు, శేఖర్, శ్రీనివాసులు, చిన్నా, వంశీ, రాజా, రాము, ప్రవీణ్, చంటి, పరశురాం, సావిత్రమ్మ, కామేశ్వరమ్మ, కామాక్షమ్మ, సుమలత, కొండమ్మ, లక్ష్మీ, ప్రేమ, స్వాతి, సంధ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

- 12వ డివిజన్ పరిధిలోని వావిలేటిపాడు, ముస్లింపాళెంలో వైఎస్సార్‌సీపీ నేత జయవర్ధన్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి త్వరలో జరగనున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. 12వ డివిజన్ పార్టీ నేతలు వేణురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, షాను, కరిముల్లా, కార్యకర్తలు పాల్గొన్నారు.
- రూరల్ నియోజకవర్గ పరిధిలోని 21వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మొయిళ్ల గౌరి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని ఫ్యాను గుర్తుపై ఓటేసి ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, వెంకటరత్నం, పెంచలనర్సారెడ్డి, రాజారెడ్డి, గల్లాశీను, శేఖర్, సాయి, రమణయ్య, బుజ్జన్న, మల్యాద్రి, అక్బర్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితే లక్ష్యాలను సాధించవచ్చు



సివిల్స్ ర్యాంకర్ వెంకటేష్‌ను సత్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్): యువత కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని సివిల్స్–2024 ఫలితాల్లో 467వ ర్యాంకు సాధించిన శ్రీకాకుళం జిల్లా అల్లాడిపేటకు చెందిన బాన్న వెంకటేష్ తెలిపారు. నెల్లూరులోని తన బంధువైన, పీహెచ్‌పీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు బైరి శంకరరావు ఇంటికి వచ్చిన వెంకటేష్ ఆ అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓను పెంచలయ్యను గురువారం మర్యాదపూర్వకంగా కలవగా శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తాను ఎన్ఐటీలో చదివేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. రెండేళ్ల పాటు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసిన తర్వాత సివిల్స్ శిక్షణ తీసుకుని రెండో ప్రయత్నంలోనే ర్యాంకు సాధించానని తెలిపారు. తనను పీహెచ్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, వీరయ్య, మస్తానయ్య, వెంకటరమణయ్య, బైరి శంకరరావు పాల్గొన్నారు.

మితిమీరిన ఆంక్షలతో ప్రజల అవస్థ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు లోక్‌సభ నామినేషన్ కేంద్రం వద్ద మితి మీరిన ఆంక్షలు విధించడంతో నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. నెల్లూరు లోక్‌సభ స్థానానికి సంబంధించిన నామినేషన్ కేంద్రాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా వీఆర్సీ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రహదారిలోని జెడ్పీ కార్యాలయం వద్ద, కలెక్టరేట్‌కు వెళ్లే మిగిలిన రహదారుల్లో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిషేధించారు. జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, గృహాలు ఉన్నాయి. ఈ మార్గంలో వాహనాలను అనుమతించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి వర్ణణాతీతంగా మారింది. దీంతో ప్రజలు ముందస్తు సమాచారం లేకుండా ఇలా చేయడం సరికాదని విధుల్లో ఉన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



నెల్లూరు(బృందావనం): జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ సీనియర్ సభ్యుడు మండవ శ్రీనివాసరావు పుట్టిన రోజును పురస్కరించుకుని పొదలకూరు రోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. తొలుత వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండవ శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి మజ్జిగ పంపిణీ చేశారు. అసోసియేషన్ నిర్వాహకులు మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, చెంచయ్య, సీఎల్ ప్రసాద్, ఎంపీ కృష్ణయ్య, రాజగోపాల్ , సుజన, మేరీబ్లెస్సింగ్టన్, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



బాలాజీనగర్‌లో హంస వాహనంపై కోదండరాముడు



మూలాపేటలో వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు



సంతపేటలో సింహ వాహనంపై ఆంజనేయస్వామి

నెల్లూరు(బృందావనం): నగరంలోని ప్రధాన ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం దేవతామూర్తులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. దేవతామూర్తులు విశేషాలంకారాల్లో కొలువై భక్తులను అనుగ్రహించారు. ఆయా ప్రాంతాల్లో బ్రహ్మోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

- సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం రాత్రి ఆంజనేయస్వామి సింహ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా వొమ్మిన నాగసతీష్, భానుమతి దంపతులు వ్యవహరించారు. ఆలయ ఈఓ జీ దర్గయ్య, మహేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం సాయంత్రం అంకురార్పణ చేశారు. దేవస్థానం ఈఓ జీ దర్గయ్య, మహేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ గురువారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు కొడిముద్ద ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గరుడ హోమం, గరుడ ప్రతిష్ఠ, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, వాస్తుహోమం, బలిహరణ, తదితర పూజలు నిర్వహించారు. రాత్రి అనంత కోదండరాముడ్ని విశేషంగా అలంకరించి హంస వాహనంపై కొలువుదీర్చి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా నాళం వెంకటేశ్వర్లు, భారతిరమాదేవి దంపతులు, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ పాలక మండలి అధ్యక్ష,కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, ఎస్వీ రత్నం, కోశాధికారి టీ మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.
- మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి అంకురార్పణ పూజలు చేశారు. వేణుగోపాలుడి పేట ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా పుట్టా శ్రీనివాసులురెడ్డి, వెంకటసౌజన్య దంపతులు వ్యవహరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, పాలక మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- వేదాయపాళెంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న సద్గురు త్యాగరాజస్వామి మందిరంలో కొలువైన కోదండరామస్వామికి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమంజనం, ఊంజల్‌సేవ నిర్వహించారు. కమలాంబిక సహిత త్యాగరాజేశ్వరస్వామికి సాముహిక శివ సహస్రనామార్చన పారాయణం, సీతారామలక్ష్మణహనుమత్ సమేత సద్గురు త్యాగరాజస్వామికి విశేషపూజలు నిర్వహించారు. కోదండరామస్వామి శేష వాహన సేవలో భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా గోపిదేశి మస్తానయ్య, కృష్ణవేణి, జీ మహిధర్, అర్చన దంపతులు వ్యవహరించారు. శ్రీత్యాగరాజ మందిర కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వేదాయపాళెం త్యాగరాజస్వామి మందిరంలో..



ఉస్మాన్‌సాహెబ్‌పేటలో..